# సంఘానికెందుకో కన్నెర్ర?

నిట్టల శ్రీరామమూర్తి

"నువ్వా వెధవతో స్నేహంచెయ్యడానికి వీల్లేదు" అని గర్జించేడు తండ్రి.

"ఆ పోకిరీవాడితో తిరక్కురా" అని బతిమాలింది తల్లి.

"వాడు పట్టి తాగుబోతు, జూదగొట్టు...... చెడిపోతావ్" అని హెచ్చరించేరు మిత్రులు. రామారావుకేం పాలిపోటంలేదు. అందరూ శంకరంమీద అల్లా విరుచుకుపడ్డానికి కారణం బోధపడలేదు. సంఘానికెందుకో ఇంత ఈర్ష్య తన స్నేహితునిమీద? శంకరాన్నీ, తననీ పెనవేసుకున్న ప్రేమానుబంధం లోకానికేం తెలుసు? లోకం, ఒకవిధమైన నియమాలు పెట్టుకొని వాటికి వ్యతిరేకంగా ఉన్నవాణ్ణి గర్హించడమేనా పని?

శంకరం దారిలో కనిపించేడు. "ఒరేయి రామూ, ఇవాళ్నించి నాతో తిరక్కు. నా మూలాన్ని నీక్కూడా అప్రదిష్ట వస్తోంది" అన్నాడు. "లోకానికి జడిసి మన ప్రేమస్నేహాల్ని తెంచుకుంటాననుకున్నావుట్రా" అని తను సమాధానం ఇచ్చేడు.

శంకరాన్ని చులకనచేసిన పెద్దమనుష్యులంతా సమయం దొరికితే వాడు చేసే పనులన్నీ చేసే రకమే. వాళ్లు రహస్యంగా చేసినవి, మనసులో చేద్దామనుకుని పైవాళ్ళకి జడిసో, తమలో శక్తి చాలకో, అవకాశం లేకో మానుకున్నవి, అతను నిర్భయంగా చేస్తున్నాడు. అంతేనా లేడా? వాళ్లు నైతికధర్మాల్ని నమ్మి అనువర్తించలేనప్పుడు, వాడికి నైతికనీరస ముందని తిట్టడమెందుకు? పైగా ఈ మిత్రులంతా వాడిని, కాఫీ హోటల్, సినిమావగైరాలకు ఖర్చుపెట్టించి దరిద్రుణ్ణిచేసేరు. ఇప్పుడు అవసరం తీరేక వాడిని తిట్టిపోస్తున్నారు. దొంగకబుర్లతో సర్వం క్షవరం చేసే ఈ మిత్రులికన్నా శంకరం ఎన్నిరెట్లు నయం! ఇంకోడి సొమ్ము ముట్టుకునేవాడు కాడు. ఉంటే ఖర్చుపెట్టుకోడం లేకపోతే ఆవేళకు మానుకోడం.

శంకరం జూదరి! గుఱ్ఱపుపందాలకు వెళ్ళే దర్జాపురుషులూ, (స్త్రీలుకూడా) క్లబ్బుల్లో రూపాయలమీద పేకాట ఆడే నాగరికులూ, పజిల్స్‌కి వందలకొద్దీ తగలేసే విద్యావంతులూ — ఈ జూదర్లు ఎవరూ కనిపించలేదు సంఘానికి. కానీ అర్ధణాలతో పేకాట ఆడే శంకరు కనిపించేడు. ఒకని కష్టాల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యంగా ఉండే సంఘానికి వాడు సుఖిస్తున్నప్పుడు ఆటంకపెట్టడానికి ఏం అధికారం ఉంది?

శంకరం తన హృదయాన్నే ఇచ్చేసేడు తనకు. చిన్నప్పట్నించీ ఎదుగుతో వచ్చిన స్నేహలత ఇప్పుడు తెగిపోమంటే ఎల్లా తెగిపోయింది? స్వార్థం లేని ప్రేమను ఈ స్వార్థప్రపంచం హర్షించగలదా.

విమర్శించేవాళ్ళకే శంకరంనడత ఉన్నప్పుడు శంకరం నడిస్తే తప్పులేదన్నే సాకు శంకరాన్ని దుర్నడతకి ప్రోత్సహించటం కాదా అని అడిగేడు నారాయణరావు. నిజమే. వాడు పాడైపోతున్నాడని దూరంగా ఉంచితే ఇంక వాడెలాగ బాగుపడతాడు? మనకు వాడిలో తప్పున్నదని తోచినపుడు, కూడా ఉండి, స్నేహబలంచేత సరియైనత్రోవలో పెట్టాలి. ఎవరైతే నైతిక ధర్మాన్ని తుచ తప్పకుండా అనుసరిస్తాడో వాడికే చెల్లింది శంకరాన్ని విమర్శించడానికి. ఆ శక్తి లేని సంఘం వాడిని నిరసించి దూరంచేయడానికి హక్కులేదు.

మొన్న జరిగిన శంకరం పెళ్ళి, తత్సంబంధమైన లోకం రిమార్కులూ తలుచుకుంటూంటే ఆశ్చర్యం వేస్తుంది. శంకరం బోగంపిల్లని పెళ్ళాడేడని ప్రతివాడినోటా ఈసడింపే. (కృష్ణ విమర్శ

శల్లో భోగంవీధుల్ని దర్శించే ప్రముఖులుకూడా ఉన్నారు. భోగం పిల్లని పెళ్ళాడేడంటే శంకరానికే చెల్లింది. విశాలహృదయం ఉంది కాబట్టే ఈపని చేయగలిగేడు. ఈ సాహసం చేసేడు. కనకే ఆ పిల్లకి కృతజ్ఞతా ప్రేమ ఎక్కువయ్యాయి. సాధారణ సంసారాల్లో పెళ్ళి అనగానే కామాన్నే ప్రేమ అనుకుని సంచరించటం, ఆ పొంగు తగ్గగానే కలహాలూ, మనస్పర్థలూ, ఒకళ్ళు చేయించలేదనీ, పెట్టలేదనీ విసుక్కోడాలూ ఇత్యాదులు జరుగుతుంటాయి. ఈ సంసారులు శంకరాన్ని విమర్శించేరు. వాళ్ళలాగే అతను కూడా ప్రేమ అనేది చచ్చి, యంత్రాల్లాగ జీవితాన్ని వెళ్లబుచ్చుతుంటారా? అసలు ప్రేమ అనేది కలగడానికి మామూలు పెళ్ళిలో భర్త కాని భార్యకాని చేసిన ఘనకార్యం ఏమిటి! తన అందాన్నే చూసి పెళ్ళి చేసుకున్నాడని ఆమె, తనవల్లో దానిమూసే చేసుకుందని అతనూ 'స్వా'న్నే కారణంగా పెట్టుకుంటారు కాని, తనకు లోటున్నా అవతలమనిషి త్యాగబుద్ధితో చేసుకున్నట్లు అనుకోడు. అంచేతే కామం లేదనటం సంసారసౌఖ్యానికి ఓ ఫుల్‌స్టాప్ అయింది. శంకరం త్యాగం చేసే చేసుకున్నాడని ఆమె కృతజ్ఞతా ప్రేమతో అతన్ని వాంఛించింది. వాళ్ళ జీవితం సాఫీగా నడిచింది.

రామారావు స్నేహవాక్కులూ, అమ్మాయి ప్రేమసల్లాపాలూ శంకరం జీవితాన్ని దుందుడుకు మార్గంలోంచి తప్పించేయి. శంకరానికి వాళ్లిద్దరే ఆప్తులు.

ఏభైరెండో సంవత్సరంలో శంకరం భార్యసహితంగా ఈ లోకాన్ని వదిలేడు. ముసలితనపు చీదరింపులూ, జబ్బులూ, నీరసాలు మొదలైన బాధలు లేకుండా, స్వార్థ ప్రపంచాన్ని వదిలినందుకు మనసులో తాను సమాధానపడినా రామారావుకి మిత్రవియోగం దుర్భరమైంది. ప్రకృతితో ప్రసంగిస్తూ, తన్ను తానే ఓదార్చుకుంటూ, ఆ పచ్చని మైదానంలోని ఒంటి కుటీరంలో రామారావు ఒక్కడూ తన ఆఖరిరోజులు గడిపేడు శంకరాన్నే తలుచుకుంటూ.

---

ందవాణి *

కలంపోటు :

# దొంగ నాయకులు!

యం. దుర్గాకుమారి

*

పార్టీపేరుతొ
ప్రపంచమంతా
ప్రజారాజ్యమని
పరిపాలించే
దొంగనాయకుల
తొలగమటంచును
శంఖారావం ఊదర భాయీ!

కాంగ్రెసు పేరుతో
ఖద్దరు వేస్తూ
గాంధీటోపీ
ఘనముగ బెట్టిన
చలామణయ్యే
కాలము కాస్తా
చెల్లిన దంచును
చెప్పర భాయీ!

బావుల గుంటల త్రవ్విస్తామ్
బారుగ రోడ్లను వేయిస్తాం
ఓటు కన్యకను మాకిస్తే మీ
కాటకమంతా తొలగిస్తాం

పేదతనాన్ని నిర్మూలిస్తాం
పెద్దవారలను రానిస్తామా?
కాదనబోకోయ్- కాంగ్రెసుమాటను
బోధనలింక- పోనగవటంచును
శంఖారావం ఊదర భాయీ!

చేపెడిదేమో చెప్పుమటంచును
చెప్పినదేమో చెయ్యమటంచును
ఉత్తమాటలతొ పూళ్ళేలాలని
ఉట్టితొ స్వర్గం బెక్కాలంటె
ఉడకదు పప్పని పూదర భాయీ!
మతాలపేరుతొ మంటలు రేపుతు
కులాలపేరుతొ కొల్లగొట్టుతు
ప్రజలపేరుతొ దేశము దోచెడు
ఛోటాపెద్దల మాటకు పోటని
శంఖారావం ఊదర భాయీ!